క్లుప్తంగా

వల్లూరమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్, అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



కామేపల్లి పోలేరమ్మ తల్లి

కొండపి: జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలోని పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దేవస్థానం ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

30న మండల సమావేశం

హనుమంతునిపాడు: మండల సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలి

వెలిగండ్ల: ప్రతి ఇంటికీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల నాయకుడు రాయళ్ల మాల కొండయ్య అన్నారు. వెలిగండ్లలో ప్రోగ్రో సివ్ స్టడీ సర్కిల్ క్లాస్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపుతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలన్నారు. సీపీఎం నాయకులు కండె బాలకృష్ణ, పగడాల చక్రీరావు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మర్రిపూడి ఎస్సై



ఎస్సై శివ బసవరాజు

మర్రిపూడి: మర్రిపూడి నూతన ఎస్సైగా సీహెచ్ శివ బసవరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఒంగోలు సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో విధులు నిర్వరిస్తూ బదిలీపై మర్రిపూడిలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి.అంకమ్మరావు దోర్నాల మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సై విలేకర్లతో మాట్లాడుతూ..మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

బాధ్యతలు చేపట్టిన సింగరాయకొండ ఎస్సై



ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా టి.శ్రీరామ్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. డిస్ట్రిక్ వీఆర్‌లో ఉన్న ఆయనకు సింగరాయకొండలో పోస్టింగ్ ఇస్తూ ఎస్పీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై ఫిరోజ్ ఫాతిమాను ఒంగోలు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నూతన ఎస్సై శ్రీరామ్‌కు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంటే విజ్ఞానం పెంపొందించుకోవచ్చని స్థానిక గ్రంథపాలకుడు జి.వర్ధనరాజు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు గ్రంథాలయంలో మరిన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

ప్రతి ఇంట్లో సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. సీఎస్‌పురం మండలం చింతపూడు నాగులవరం సచివాలయంలోని కోమటిగుంట్ల, చింతపూడి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సంక్షేమ పథకాల అమలుతో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. కరోనా కష్ట కాలంలో సైతం ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందచేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాలతో రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎంగా చేయాలని కోరారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను లబ్ధిని వివరించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత జెడ్పీటీసీ మేకల శ్రీను, సర్పంచ్ ఉప్పాల సరోజనమ్మ, వసంతకుమార్, మల్లి కార్జున రాజు, బైరెడ్డి తిరుపతిరెడ్డి, కృపారావు, మురాజీ, దుగ్గిరెడ్డి జయరెడ్డి, భువనగిరి వెంకటయ్య, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మితికల గురవయ్య, జయమ్మ, బుర్రా నరేష్, బి.రమణయ్యలు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, ఎల్ఐసీ అంజనేయులు, కాకు నాగేశ్వరరావు, ప్రసాద్, అద్దంకి రమణయ్య, జాజుల తిరుపాలు, వీరాంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

కనిగిరి రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. సీఎస్‌పురం మండలం చింతపూడిలో రూ.25లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పాల సరోజనమ్మ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు దరిచేరాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా అర్హత కల్గిన లబ్ధిదారులందరికీ అందుతున్నట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు వ్యయ, ప్రయాసలు తగ్గాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల శ్రీను, వసంతకుమార్, మురాజీ, బైరెడ్డి తిరుపతిరెడ్డి, మల్లికార్జునరాజు, భువనగిరి వెంకటయ్య, డి.జయరెడ్డి, శివ, మాజీ ఎంపీటీసీ మితకల గురవయ్య, కృపారావు బుర్రా నరేష్, బి.రమణ, అంజనేయులు, నాగేశ్వరరావు, కాకు నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు
- కారుమంచిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కారుమంచి గ్రామ సచివాలయం పరిధిలో అశోక్‌బాబు తన సతీమణి లక్ష్మితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి, సమస్యలేమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు, అర్హత ఉండి కూడా పథకాలు పొందలేకపోయిన వారిని గుర్తించి న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గత టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గ్రహించాలని ప్రజలను కోరారు. పేదలకు మంచి చేయాలని ప్రతి క్షణం పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు బురద చల్లేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. తొలుత అశోక్‌బాబుకు గ్రామస్తులు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీఓ రత్న జ్యోతి, రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఆనం సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు బుల్లా శ్రీను, మన్నం శ్రీనివాసులు, కంజుల వెంకటరామిరెడ్డి, సుల్తాన్‌బాషా, పఠాన్ జిలానీ, అబ్దుల్లా, పాట్లూరి వెంకట్రావు, వాకా బాలకృష్ణారెడ్డి, అన్ని శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ మూలవిగ్రహమూర్తి

పామూరు: గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అర్చకులు పోలేరమ్మ మూల విగ్రహమూర్తికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలను తీసుకుని భజంత్రీల మేళతాళాల నడుమ ఉత్సవంగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, యాదాల సాయికిరణ్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పశుపులేటి రఘురాం, గుర్రం వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు యాటా రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అఖండసాయి నామ సప్తాహం



ప్రత్యేక పూజల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి దంపతులు

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో గురువారం అఖండ సాయి సప్తహం వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, పద్మావతి దంపతులు పాల్గొని అఖండ జ్యోతిని వెలిగించారు. ధనెంకుల తిరుమలరావు, తిరుపాలమ్మ దంపతులు గో పూజ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, లక్ష్మీ నర్సారెడ్డి, భూతల పల్లి మాలకొండారెడ్డి, ముచ్చర్ల ధర్మ, టంగుటూరి గోవిందరావు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మండ్లా వెంకటేశ్వర్లు, ఈర్ల గురవయ్య, వీసీ రావశాస్త్రీ, ఏసీ చెంచులు కోటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుర్రాకు సన్మానం



ఎమ్మెల్యే బుర్రాను సన్మానిస్తున్న వైఎస్సార్ టీఎఫ్, 98 డీఎస్సీ టీచర్లు

కనిగిరి రూరల్: వైఎస్సార్ టీఎఫ్ ఆధ్వర్యంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు, 98 డీఎస్సీ(ఎంటీఎస్) టీచర్లు ఆదివారం స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2లు దేవిరెడ్డి రామిరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, 98 డీఎస్సీ(ఎంటీఎస్) సంఘ నాయకులు ఎమ్మెల్యే బుర్రాను ఘనంగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్ టీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు గజ్జల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులరెడ్డిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం విద్య రంగంలో అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ రంగనాయకులరెడ్డి, వైఎస్సార్ టీఎఫ్, 1998 డీఎస్సీ (ఎంటీఎస్) సంఘ నాయకులు దుగ్గిరెడ్డి రాజమోహన్‌రెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, మీరా మొహిద్దీన్, కల్లు నారాయణరెడ్డి, కామిరెడ్డి తిరుపతిరెడ్డి, ముక్కు పాపిరెడ్డి, చెరుక్క నారాయణరెడ్డి, కృష్ణామూర్తి, అచ్చాల ఆదినర్సారెడ్డి, మూలె రమణారెడ్డి, కేవీ నారాయణరెడ్డి, పి. రమణారెడ్డి, శ్యామల రాధకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న మండల సమావేశం

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ రఫీక్‌అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

కనిగిరిలో ఈదురుగాలులతో వర్షం



హనుమంతునిపాడులో రోడ్లపై పారుతున్న వర్షం నీరు

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఒక మోస్తారు వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గింది. చాలా సేపు వరకు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

హనుమంతునిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షం పడింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. హనుమంతునిపాడు, కొండారెడ్డిపల్లి, హాజీపురం, కొత్తూరు, మోరవారిపల్లి, నీలకంఠాపురం తదితర గ్రామాల్లో వర్షం పడింది.

సోషల్ మీడియా సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ఎంజీఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా కోఆర్డినేటర్ల, కన్వీనర్ల ఆత్మీయ కలయిక సమావేశం నియోజకవర్గ కన్వీనర్ మర్రి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పచ్చమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా కన్వీనర్లకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, తమ్మినేని సుజాత రెడ్డి, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలాని, వైస్ ఎంపీపీ గాలిబోయిన ధనుంజయ్, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రాత్రి ఉదయించిన రవి మహాస్వప్న



దిగంబరకవి మహాస్వప్నకు నివాళులర్పిస్తున్న వక్తలు

లింగసముద్రం: రాత్రి ఉదయిస్తున్న రవినంటూ సాహితీ సముద్రంలో తీవ్ర సంచలనం రేపిన దిగంబరకవి మహాస్వప్న అని కవి బద్దిపూడి జయరావ్ అన్నారు. స్థానిక కేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ పూరిమిట్ల బాలకోటయ్య అధ్యక్షతన మహాస్వప్న నాలుగవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహాస్వప్న చిత్రపటానికి పూలమాలలు వేసి వక్తలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కవి జయరావ్, మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, హెచ్‌ఎం యు.మాధవరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు వీవీ శేషయ్య, మార్తాటి ఈశ్వర గోపాల్ కోక్‌సత్తా మెంబర్ ఎం.మాలకొండారెడ్డి, చిటితోటి బాలకోటయ్య, కొరివి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్ర

కందుకూరు: పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామచంద్ర హెచ్చరించారు. పట్టణంలోని ఉప్పుచెరువులో ఆదివారం అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుచెరువుతో పాటు, పట్టణంలోని పలు శివారు ప్రాంతాల్లో యువత అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉందని, వీరిని గుర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రధానంగా గంజాయి తాగినా, గంజాయిని కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. 121 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి గంజాయి సమాచారం ఇవ్వవచ్చని, పట్టణంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు, కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవించడం పూర్తిగా నిషేధమని, వ్యభిచారం నిర్వహించే వారి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే బాల్య వివాహాలు చేసినా తల్లిదండ్రులకు శిక్ష తప్పదన్నారు. సీఐ వెంకట్రావ్, పట్టణ ఎస్సై హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని గోపవరపు వారిపల్లిలో వెలసిన పోలేరమ్మకు ఆదివారం భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేరమ్మకు గోపవరపు పుల్లారెడ్డి అనే భక్తుడు కుంకుమ బండి ఏర్పాటు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపునకు గ్రామంలో యువకులు భారీగా హాజరయ్యారు. భక్తులు భారీగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామోత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా

గుడ్లూరు: గుడ్లూరు ఎస్సీ కాలనీలో ఉన్న కుటుంబాలకు ట్యాంక్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ పాలకీర్తి శంకర్ తెలిపారు. ఎస్టీ కాలనీలో చివర ఉన్న కుటుంబాలు ఎగువ ప్రాంతంలో ఉండడంతో వారికి రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో పంచాయతీ కార్యదర్శి మహేష్‌తో కలిసి ట్యాంకర్ ద్వారా కాలనీకి మంచి నీటిని సరఫరా చేశారు.

జమ్మలమడక మాజీ సర్పంచ్ గురవయ్య మృతి



పోతుల గురవయ్య(ఫైల్)

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు, జమ్మలమడక మాజీ సర్పంచ్ పోతుల గురవయ్య(72) ఆదివారం మృతి చెందారు. పోతుల గురవయ్య భౌతికకాయాన్ని సర్పంచ్ పాశం కొండయ్య, పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. గురవయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీటీసీ హజరతమ్మ, ఎంపీపీ దంతులూరి ప్రకాశం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రసేన్ అన్నారు. మండలంలోని గుండ్లపాలెం, కొత్తపేట గ్రామాల్లో ఆదివారం జగనన్న సురక్ష కింద అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజలకు సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు.

నేడు జగనన్న ఆణిముత్యాలకు ప్రోత్సాహకాలు

కనిగిరి రూరల్: జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాల పంపిణీలో సోమవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారని ఎంఈఓలు జె. ప్రసాద్‌రావు, యు నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.